వైభవంగా గొబ్బెమ్మ నిమజ్జనం

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో సోమవారం అత్యంత వైభవంగా గొబ్బెమ్మ నిమజ్జనం నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి మహిళలు గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామంలోని శ్రీరామమందిరం నుంచి గొబ్బెమ్మను ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకుని వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మేళతాళాలు, బాణసంచా కాల్చారు. గ్రామ ఎస్సీ కాలనీలో గొబ్బెమ్మ నిమజ్జన మహోత్సవంలో భాగంగా ప్రత్యేకంగా పొంగళ్లు పెట్టుకున్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో గొబ్బెమ్మ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పాల్గొని గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనంలో పాల్గొన్నారు.



చెన్నారెడ్డిపల్లిలో గొబ్బెమ్మ నిమజ్జన మహోత్సవం

మహాశివుడి గ్రామోత్సవం

ముత్తుకూరు: కనుమ పండగ సందర్భంగా పశుపతినాథుడైన మహాశివుడి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు జరిగాయి. కృష్ణపట్నంలోని సిద్ధేశ్వరాలయంలో మేళతాళాల నడుమ మహాదేవుడి గ్రామోత్సవం కనుల పండువగా జరిపారు. ఈపూరు, వల్లూరు, బ్రహదేవి, పోలంరాజుగుంట, పిడతాపోలూరు, పైనాపురం గ్రామాల్లోని ముక్కంటి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



కృష్ణపట్నంలో జరిగిన మహాశివుడి గ్రామోత్సవం

ఘనంగా కనుమ

ముత్తుకూరు: సంక్రాంతి పండగల్లో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండగను ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్యంగా రైతుల ఇళ్లల్లో గొడ్ల చావిడులను శుభ్రం చేశారు. పశువులు, దూడలను రంగలతో అందంగా అలంకరించి, ప్రత్యేకంగా పూజలు చేశారు. వాటికి పొంగళ్లను నైవేద్యంగా పెట్టారు. నేలటూరు, కృష్ణపట్నం, ముత్తుకూరు, బ్రహ్మదేవి, పోలంరాజుగుంట, పంటపాళెం, దొరువులపాళెం పంచాయతీల్లో పశువుల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



కృష్ణపట్నంలో పశువులను అలంకరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోపూజ



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున స్వామి, కామాక్షితాయి దేవస్థాన గోశాలలో గోపూజను బుధవారం నిర్వహించారు. ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సంగం : ఆగి ఉన్న కారును వెనుక నుంచి మోటారు బైక్ ఢీకొని ఓ యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కోలగట్ల వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆత్మకూరు వైపు నుంచి సంగం వైపు వస్తున్న కారు కోలగట్ల వద్ద రోడ్డు పక్కన ఆగింది. దీనిని గమనించని ఆత్మకూరు నుంచి సంగం వైపు వెళ్తున్న బైక్ వేగంగా కారును ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోడి పందేల స్థావరంపై దాడి

ఆత్మకూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామ శివారు పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై ఎస్సై జిలానీ బుధవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1,050ల నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల బండలాగుడు పోటీలు



సోమశిల : అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు, కమ్మవారిపల్లి గ్రామ దేవత శ్రీధర్మ పల్లెమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. దీనిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కాగా పోటీల్లో మొదటి స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా, గొల్లపల్లికి చెందిన రామచరణ్ వీఆర్సీ బుల్స్ నిలువగా, రెండో స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా నాగయపల్లికి చెందిన వేమారెడ్డి ఎడ్లు, మూడో స్థానంలో కడప జిల్లా, కాదర్‌టౌన్ కొట్టాలు, డి.భావన ఎడ్లు, నాలుగో స్థానంలో మైదుకూరుకు చెందిన డి.భావన ఎడ్లు నిలిచాయి. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు వెంకటరమణయ్య, దియ్యాల రమేష్ మాట్లాడుతూ ఏటా సంక్రాంతి పండగ రోజున అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని, కనుమ రోజున ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలియజేశారు. అనంతరం విజేతలకు ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సైలు సూర్యప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాసులు, జిలానీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గుడిపల్లిపాడులో ఘర్షణ

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని గుడిపల్లిపాడులో ఇరువర్గాలు దాడి చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు.. గుడిపల్లిపాడులోని అరుంధతీయపాళేనికి చెందిన మణీంద్ర, అశోక్ వేర్వేరుగా మద్యం సేవించసాగారు. ఈ క్రమంలో వీరి మధ్య మాటామాటా పెరిగడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అనంతరం మణీంద్ర తన వర్గంతో కలిసి అశోక్ ఇంటికెళ్లి వారిపై దాడి చేశారు. మణీంద్ర వర్గానికి చెందిన వారూ గాయపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ మండల జనరల్ సెక్రటరీ సురేష్ మాట్లాడారు. తన కుటుంబంపై మణీంద్ర వర్గం దాడికి పాల్పడిందని ఆరోపించారు. కాగా అశోక్‌పై మణీంద్ర వర్గం ఫిర్యాదు చేసింది.

వేమన జయంతికి ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నగరంలో ఈ నెల 19న నిర్వహించనున్న వేమన భగవాన్ జయంతి కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆహ్వానించామని త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు నగరాధ్యక్షుడు సురమౌళి తెలిపారు. కార్యక్రమాన్ని రెడ్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు.

వైఎస్సార్సీపీని మరింత బలోపేతం చేయాలి

కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి కోరారు. మండలంలోని దామేగుంట, వెంకన్నపురం, బసవాయపాళేనికి చెందిన పార్టీ నేతలను మర్యాదపూర్వకంగా బుధవారం కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. టీడీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న తరుణంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. వెంకన్నపురం సర్పంచ్ బండి పెంచలయ్య, డీఎల్డీఏ మాజీ డైరెక్టర్ మందపల్లి మల్లికార్జున, తలమంచి సొసైటీ మాజీ అధ్యక్షుడు నందకుమార్‌రెడ్డి, నేత అనిల్‌కుమార్‌రెడ్డి, కొట్టే మల్లికార్జున, నరసింహరావు, మురళి, వెంకటేశ్వర్లు, సుధీర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



విజేత జట్టు

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేటలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. పది జట్లు పాల్గొనగా, ఛత్రపతి శివాజీ.. జేఎస్కే.. బీఎమ్కే మెమోరియల్.. ఏబీకే వారియర్స్ జట్లు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.తొమ్మిది వేలు, రూ.ఏడు వేలు, రూ.ఐదు వేలు, రూ.మూడు వేలను అందజేశారు. బొట్టు వెంకటేశ్వర్లు, మేరిగ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి

బుచ్చిరెడ్డిపాళెం: ద్విచక్రవాహనదారులు హెల్మెట్లను విధిగా ధరించాలని సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని దామరమడుగులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న పోలీసులు

సురేష్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలి

పొదలకూరు : సీనియర్ బీజేపీ నాయకుడు, జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నియమించాలని మండల బీజేపీ నాయకులు చింతగింజల చినసుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయరావు అధిష్ఠానికి వినతి చేశారు. పొదలకూరులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సురేష్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతో శ్రమించిన నేత అని, ఆయనకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా అన్ని అర్హతలు కలిగి ఉన్నారన్నారు. సమావేశంలో జిల్లా బీజేవైఎం ట్రెజరర్ ప్రశాంత్, నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పోటీల విజేతలకు బహుమతులు



కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచిన మహ్మదాపురం జట్టుకు బహుమతిని అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురంలో సంక్రాంతి సందర్భంగా పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో కబడ్డీ, ఎద్దుల అందాలు, పరుగు పందెం, ముగ్గులు, మహిళలకు వంటల పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, అడపాల సుధాకర్‌రెడ్డి తదితరులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఆర్గనైజర్లు శివారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



బుచ్చిరెడ్డిపాళెం: రేబాలలోని ఎస్కేఆర్ఎస్ – డీఎల్ఎన్నార్ ప్రభుత్వ హైస్కూల్లో 1986 – 87 మధ్య పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఓ అతిథిగృహంలో బుధవారం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు. ఐదేళ్ల తర్వాత అందరూ మరోసారి కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం

పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్లో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం ఏర్పాటు చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పడిపూజ, స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జ్యోతిని దర్శించుకున్నారు. దేవస్థానం నిర్వాహకులు సాయంత్రం మహిళలకు రంగ వల్లుల పోటీలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా పుట్టాలమ్మ గ్రామోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో వెలసిన పుట్టాలమ్మ తల్లి గ్రామోత్సవాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కచేరి అలరించింది.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కొందరు దాడి చేసి గాయపర్చి, చంపుతామని బెదిరించిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని కొండదిబ్బకు చెందిన సుబ్రహ్మణ్యం కార్పొరేషన్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నగరానికి చెందిన యశ్వంత్ ద్వారా తిరుపతికి రొయ్యలను ఆయన పంపగా, అవి చెడిపోయాయి. విషయం తెలుసుకున్న సుబ్రహ్మణ్యం.. యశ్వంత్‌ను పది రోజుల క్రితం నిలదీయడంతో వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సుబ్రహ్మణ్యం తన స్నేహితుడు కృష్ణతో కలిసి పాత జెడ్పీ సెంటర్ వద్ద మంగళవారం ఉండగా, కిశోర్, విన్‌బాబు వీరి వద్దకొచ్చారు. తమ స్నేహితుడితో గొడవ పెట్టుకుంటావానంటూ దాడి చేశారు. స్థానికులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన సుబ్రహ్మణ్యం జీజీహెచ్‌లో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రమాదేవి మృతి బాధాకరం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారిగా పనిచేసి.. బాపట్ల జిల్లా ఏడీఎంహెచ్‌ఓగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రమాదేవి మృతి చెందడం బాధాకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం



సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన చిత్రం

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం చేశారు. బీవీనగర్‌లో రహదారులపై పార్క్ చేసిన ఐదు కార్ల అద్దాలను బుధవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల ప్రాంతంలో రాళ్లతో ధ్వంసం చేసి అక్కడి నుంచి ఉడాయించారు. కార్ల అద్దాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన యజమానులు స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇందులో కార్ల అద్దాలను రాళతో యువకులు పగలగొడుతున్న దృశ్యాలు రికార్డవడంతో వాటిని సేకరించారు. సదరు యువకుల కోసం పరిసర ప్రాంతాల్లో ఆరాతీశారు. అనంతరం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రంగవల్లుల పోటీలు



బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతిని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని కాశీపాళెంలో గల భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పూర్వ డిప్యూటీ కలెక్టర్ వెంకట సుధాకర్ హాజరయ్యారు.
అనంతరం విజేతలకు నగదు బహుమతులతో పాటు స్టీల్ బాక్సులను అందజేశారు. దోనిపర్తి శ్రీహరి, మల్లికార్జున, వంగర శ్రీనివాసులు, కాసుల వెంకటరమణయ్య, సుబ్బయ్య, మేడా మనోజ్, దేవస్థాన గౌరవాధ్యక్షుడు చేపూరు చలమయ్య, అధ్యక్షుడు సురేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి నరసయ్య, కోశాధికారి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కొడవలూరు: సంక్రాంతిని పురస్కరించుకొని నార్తురాజుపాళెంలోని నిమ్మ తోటలో మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. డీసీ అధ్యక్షుడు రమణారెడ్డి, నేతలు పాటూరి రమేష్, నాసిన ప్రసాద్, తువ్వర ప్రవీణ్‌కుమార్, యోగానందరెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో వేడుకగా కనుమ

పొదలకూరు: గ్రామాల్లో పాడి రైతులు బుధవారం వేడుకగా కనుమ పండగను చేసుకున్నారు. పాడి పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించారు. రైతులకు ప్రాధాన్యత కలిగిన కనుమ పండగను మండలంలోని అన్ని గ్రామాల్లో పాడిరైతులు జరుపుకున్నారు. సాధారణంగా పంట చేతికి వచ్చిన సందర్భంగా వ్యవసాయానికి పాడికి ఉపకరించే పశువులకు పూజలు చేయడం ఆనవాయితీ. అయితే ఈ ప్రాంతంలో పంటలు ఇంకా చేతికి రానందున రైతులు పశువులకు పూజలు చేశారు. ముఖ్యంగా గోవులు, గేదెలు, వ్యవసాయ పనులకు ఉపయోగించే ఎద్దులను అలంకరించారు.



గోవును పూజిస్తున్న చిన్నారులు

కోలాహలంగా క్రీడా పోటీలు

కొడవలూరు: మండలంలోని కమ్మపాళెం మజరా సంజీవనగర్ బ్రహ్మంగారి గుడి వద్ద కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, రంగవల్లులు, రన్నింగ్ రేస్, తాడులాగుడు పోటీలను వడ్డెర వృత్తిదారుల సంఘ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పోటీలకు దాదాపు 100 మంది హాజరయ్యారు. విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ మాట్లాడారు. సంక్రాంతి ఆటల పోటీలను గ్రామంలో 38 ఏళ్లుగా నిర్వహిస్తున్నారని, దీనికి స్థానికులు సహకరిస్తుండటాన్ని అభినందించారు. శ్రీకాంత్, రమేష్, పుల్లయ్య, మాల్యాద్రి, బ్రహ్మయ్య, నాగరాజు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతిని అందజేస్తున్న దయాకర్

సతీష్‌రెడ్డికి అభినందనలు



బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుచ్చిరెడ్డిపాళెం మండలాధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన చెర్లో సతీష్‌రెడ్డిని పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాగులపాడు పంచాయతీకి చెందిన వినోద్‌కుమార్, మూగ వెంకటరమణయ్య, శ్రీను, దాసరి శ్రీహరి, మురళి, వెంకీ తదితరులు పాల్గొన్నారు.